క్లుప్తంగా

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు మున్నూరుకాపు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరుకాపులు 40 లక్షల మంది ఉన్నారని, మున్నూరు కాపులందరూ పేద, మధ్యతరగతికి చెందిన వారని, ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతీ ఏడాది రూ.5 వేల కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, అంజయ్య, అశోక్ కుమార్, రాజం, రమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్‌షెడ్ మరోచోట నిర్మించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువకులు

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయ ఆవరణలో హిందూ కమ్యూనిటీ ఓపెన్‌షెడ్ నిర్మాణంలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని మరో చోట నిర్మించాలని మా ఊరు ముచ్చట్లు సభ్యులు సోమవారం కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. చెన్నకేశవనాథ పంచముఖ లింగ ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకెళ్లాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో లింగ శ్రీనివాస్, కడకుంట్ల జగదీశ్వర్, సిర్ప సంతోష్, సామల్ల సతీశ్, భోగ రాము, రాకేశ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల ఎదుట ఏబీవీపీ ధర్నా



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కోరుట్ల: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. పాఠశాలలో అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలపై విద్యాధికారులు ఏలాంటి చర్యలు చేపట్టటం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మాడవేణి సునీల్, నాయకులు వినయ్, శివ, సంజయ్, అభిరామ్, సూరత్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో ఓటర్ల వివరాలు నమోదు

మల్యాల: మండలంలో ఎన్నికల బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల జాబితాను అనుసరించి, ఓటర్ల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇంటింటికీ తిరిగి, మరణించిన వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఓటర్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ను సోమవారం తహసీల్దార్ సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని, ప్రస్తుతం బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితా ప్రకారం యాప్‌లో నమోదు చేపడుతున్నారని తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ధర్మపురి: మండలంలోని జైనా ఎస్సీ కాలనీలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన రూ.15 లక్షల నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక కృషితో నిధులు మంజూరు కావడంతోనే సీసీ పనులు చేపడుతున్నామని గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు సొల్ల భీమయ్య, జైనా పీఏసీఎస్ చైర్మన్ నరేశ్, ఉపసర్పంచ్ మొగిలయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు తీసుకున్న ఎస్సై

కోరుట్ల:కోరుట్ల నూతన ఎస్సైగా కిరణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సతీష్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ధర్మపురిలో పనిచేసిన ఎస్సై కిరణ్ కోరుట్లకు వచ్చారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజల సహకారంతో కోరుట్లలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

నిధులున్నా.. పనుల్లో జాప్యం

- 'మన ఊరు – మన బడి' పాఠశాలల్లో అసంపూర్తి పనులు
- మరుగుదొడ్లు కూల్చివేసి కొత్తవి కట్టని వైనం
- కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు



ధర్మపురి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల



ధర్మపురి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్డి

ధర్మపురి: దేవుడి వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది ధర్మపురి ప్రభుత్వ బాలికల పాఠశాల పరిస్థితి. మన ఊరు మన బడి కింద ఎంపికై పాఠశాల అభివృద్ధి చెందుతుందని ఆశిస్తే పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా మారాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలోని పాత మరుగుదొడ్లను కూల్చేసి తిరిగి నిర్మించక పోవడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మన ఊరు మనబడి కింద మండలంలో 18 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. దీనికోసం రూ. 3.40 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. 18 పాఠశాలల్లో దోనూర్, జైనా పీఎస్ పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన 16 పాఠశాలల్లో పనులు పురోగతికి నోచుకోలేక పోతున్నాయి. కానీ గతేడాది నుంచి ఉన్న సమస్యలు నేటికి అగుపిస్తున్నాయి. ధర్మపురిలోని బాలికల ఉన్నత పాఠశాలకు రూ. 60 లక్షలు మంజూరయ్యాయి. 400 వరకు విద్యార్థినులు, 15 మంది వరకు సిబ్బంది ఉన్నారు. నిధులు మంజూరయ్యాయని కాంట్రాక్టర్ పాత మరుగుదొడ్లను తొలగించి, ఇంతవరకు నిర్మించక పోవడంతో విద్యార్థులు, సిబ్బంది చాలా ఇబ్బంది పడుతున్నారు. చుట్టూ ఉన్న ఇళ్లలోకి కొందరు, ప్రైమరీ పాఠశాల మరుగుదొడ్లకు మరి కొందరు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో మూత్రశాలలు, తాగునీటి వసతులు, సంపులు, మైనర్, మేజర్ రిపేర్లు, ముఖ్యంగా పాఠశాలలకు ప్రహరీలు చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు.

మేస్త్రీగా మారిన హెచ్‌ఎం

మన ఊరు మన బడి కింద ఎంపికైన ఈ బాలికల పాఠశాలలో కనీస వసతులు కల్పించలేక పోయారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో లేబర్లను పెట్టి పనులు జరిపించాల్సి ఉండేది. అత్యవసరమైనా మరుగుదొడ్ల నిర్మాణానికి లేబర్లు లేక పోవడంతో పాఠశాల హెచ్‌ఎం చెరుకు రాజన్న మేస్త్రీగా మారి తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణానికి పూనుకున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు



కొత్త మరుగుదొడ్ల కోసం పాత మరుగుదొడ్లను తొలగించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది. కాంట్రాక్టర్ త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– అమూల్య, విద్యార్థిని

సమస్యలు చాలా ఉన్నాయి



పాఠశాలలో చదువు బాగున్నప్పటికీ సమస్యలు చాలా ఉన్నాయి. పాఠశాలలో ఉన్న బోరింగ్ చెడిపోయింది. రోజూ తాగునీరు కొనుక్కోవాల్సి వస్తుంది. మరుగుదొడ్లకు నీళ్లు లేని పరిస్థితి ఉంది. అధికారులు చొరవ తీసుకుని పనులు పూర్తి చేయించాలి.

– వైష్ణవి, విద్యార్థిని

పనులు పూర్తి చేయిస్తాం



ధర్మపురి బాలికల ఉన్నత పాఠశాలకు రూ.60 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు సకాలంలో పూర్తి చేయలేదు. తొందరగా పనులు పూర్తి చేయించి పాఠశాలలో వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం.

– బత్తుల భూమయ్య, ఎంఈవో, ధర్మపురి

ఊరూరా హరితోత్సవం

జగిత్యాలరూరల్/ కోరుట్ల/ కోరుట్ల రూరల్/మల్లాపూర్/కథలాపూర్/రాయికల్/మెట్‌పల్లి/పెగడపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో సోమవారం హరితోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఊరూరా ర్యాలీలు నిర్వహించి హరితహారం లో సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమాల్లో కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్‌ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీవోలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.



భూపతిపూర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ



పెగడపల్లిలో మొక్కలు నాటుతున్న నాయకులు



కుస్తాపూర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్



మోరపల్లిలో హరితోత్సవంలో నాయకులు

గ్రామీణులు వైద్య సేవలు వినియోగించుకోవాలి



బీపీ యంత్రాలు పంపిణీ చేస్తున్న వైద్యురాలు

మల్యాల: గ్రామీణ ప్రజలు సమీపంలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యురాలు మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం మండలంలోని ఆరోగ్య కేంద్ర ఉప కేంద్రాల ఏఎన్‌ఎంలకు డిజిటల్ బీపీ యంత్రాలను పంపిణీ చేశారు. సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసుకునేందుకు డిజిటల్ బీపీ యంత్రాలు, గ్లూకో మీటర్లు ఆయా ఆరోగ్య ఉపకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. జగిత్యాలలోని టీ- హబ్‌లో నిర్వహించి, వ్యాధులు నిర్ధారణ చేస్తున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునంద, పీహెచ్‌ఎన్ నాగలక్ష్మి, ఎన్‌సీడీ స్టాఫ్‌నర్సు పర్వీన్, ఫార్మాసిస్ట్ సరిత, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైస్‌మిల్లులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి రైస్‌మిల్లు వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



రాయికల్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయికల్/జగిత్యాలటౌన్ /ధర్మపురి/కథలాపూర్/పెగడపల్లి: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను జగిత్యాల, రాయికల్, ధర్మపురి పట్టణాలు, కథలాపూర్, పెగడపల్లి మండల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, రాయికల్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, కథలాపూర్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు,పెగడపల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలు అవసరం

జగిత్యాల: మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ అన్నారు. సోమవారం హరిత దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాధాకృష్ణ,ప్రకాశ్, లక్ష్మణ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌గా రవికిరణ్‌కుమార్



ఇబ్రహీంపట్నం: మండల తహసీల్దార్‌గా రవికిరణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ మహేశ్వర్ ఆర్డీవోగా పదోన్నతిపై వెళ్లారు. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రవికిరణ్‌కుమార్‌ను మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన రవికిరణ్‌కుమార్‌కు డిప్యూటీ తహసీల్దార్ పద్మ, సిబ్బంది స్వాగతం పలికారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం

మల్యాల: మండలంలోని మ్యాడంపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ నలువాల సంజీవ్ ప్రకటించారు. అధ్యక్షుడిగా చిర్ర రాజమల్లయ్య, ఉపాధ్యక్షుడు తడగొండ ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొత్తూరి విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి చిర్ర శ్రీకాంత్, కోశాధికారి చిర్ర మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నలువాల సంజీవ్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి మాదిగల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని కోరారు.

మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు



జగిత్యాలటౌన్: బీసీ కులవృత్తులకు ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారంతో గడువు ముగియనుంది. కుల,ఆదాయ సర్టిఫికెట్ల కోసం జనం పెద్ద ఎత్తున రావడంతో సోమవారం మీసేవ కేంద్రాలు జనంతో కిక్కిరిసిపోయాయి.

రుణ వసూళ్లలో సహకార సంఘాలు భేష్

- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు



చైర్మన్, సీఈవోను సన్మానిస్తున్న కొండూరి

ధర్మపురి/సారంగాపూర్: రైతులకిచ్చిన రుణాలు వందశాతం వసూలు చేసిన జైనా, బీర్‌పూర్ సహకార సంఘాలు భేష్ అని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ధర్మపురి మండలం జైనా సహకార సంఘం చైర్మన్ సొల్ల నరేశ్, బీర్‌పూర్ సొసైటీ చైర్మన్ ముప్పాల రాంచందర్‌రావు, సీఈవోలు బల్మూరి సాగర్‌రావు, అయ్యోరి తిరుపతిలను కొండూరి సన్మానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జైనా, బీర్‌పూర్ సహకార సంఘాలు రుణాల వసూళ్లలో పదేళ్లుగా మొదటి స్థానంలో నిలిచాయని కొనియాడారు. రానున్న కాలంలో సహకార సంఘాలు రైతులకు ఉన్నత సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో సత్యనారాయణరావు, వివిధ సహకార సంఘాల అధ్యక్షులు, సీఈవోలు పాల్గొన్నారు.

పచ్చదనం అందరి బాధ్యత

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: పచ్చదనం అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. హరితోత్సవం సందర్భంగా సోమవారం రోటరీ పార్క్, పరేడ్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చదనం కోసం గతంలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఉద్యమాలు చేశాయని, ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద మూడో మానవప్రయత్నం హరితహారం అన్నారు. ఇప్పటి వరకు 230 కోట్ల మొక్కలు నాటామని, ఈ ఏడాది 19 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జగిత్యాల పట్టణంలో టీఆర్‌నగర్ మియావాకీ జిల్లాకే తలమానికమని, 150 వివిధ రకాల మొక్కలతో మియావాకీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పట్టణంలో 14 జోన్లలో 121 సర్వేనంబర్లలో మార్పులు చేయడం జరిగిందన్నారు. 100 ఫీట్లతో యావర్‌రోడ్‌కు జీవో తీసుకురావడం జరిగిందన్నారు. పట్టణంలోని భవానినగర్‌లో సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీలత పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ, ఎస్సై

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన నటేశ్‌తో పాటు, ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాంచంద్రం సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

'అంగన్‌వాడీ' సేవలు సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో జెడ్పీటీసీ రాజేందర్‌రావు

పెగడపల్లి: అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రాజేందర్‌రావు అన్నారు. మండలంలోని ఎల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించి, కేంద్రంలో ఉన్న వసతులు, పిల్లల హాజరు శాతం, పౌష్టికాహారం పంపిణీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన ఆంగ్లంలో బోధన చేస్తున్నారని తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజమ్మ, మాజీ సర్పంచి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాజేశం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిన్నారులను చేర్పించాలి

జగిత్యాలరూరల్: చిన్నారి పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారంలో సోమవారం అంగన్‌వాడీ బడిబాట నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న ప్రీస్కూల్ పూర్వ ప్రాథమిక విద్యావిధానం- సంసిద్ధతపై అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలో పిల్లలకు ఆటపాటలతో పాటు, పౌష్టికాహారం అందిస్తూ వారికి మెరుగైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ప్రవేశం పొందిన చిన్నారులకు మంగళవారం అక్షరాభ్యాసం చేయి ంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి, అంగన్‌వాడీ టీచర్ పద్మజ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ముదిరాజ్‌లకు రూ.లక్ష సాయం అందించాలి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం కుల వృత్తులకు ఇస్తున్న రూ. 1 లక్ష ఆర్థికసాయాన్ని ముదిరాజ్‌లకు వర్తింపజేయాలని కోరుతూ సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ పద్మకు ముదిరాజ్ సంఘ సభ్యులు వినతిపత్రం అందించారు. ముదిరాజ్‌లకు బీమా సౌకర్యం కల్పించాలని, ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ– ఏకు మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పెండ్యాల సాయన్న, పిట్టల వంశీ, నేమూరి నరేశ్, గడ్డం మహేశ్, గడ్డం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్‌పై ఆర్డీవోకు ఫిర్యాదు

కథలాపూర్: బీమారం మండలం గోవిందారం గ్రామానికి చెందిన రేషన్‌డీలర్ దేవయ్యపై గ్రామస్తులు సోమవారం కోరుట్ల ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. రేషన్ డీలర్ ప్రజలపట్ల ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం, దూషిస్తున్నారని వారు పేర్కొన్నారు. రేషన్ దుకాణాన్ని వేరే వ్యక్తికి అప్పగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

వెల్గటూర్: అనారోగ్యంతో బాధపడుతున్న తమ మిత్రుడికి చేయూతనందించారు పూర్వ విద్యార్థులు, వెల్గటూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు తమ స్నేహితుడు ఆకుల వినోద్, అతని తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, తమ వాట్సాప్ గ్రూప్ ద్వారా స్నేహితులందరీ సహకారంతో రూ. 20,200 సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఇటీవల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎస్సెస్సీ 2009 పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసుకుని భవిష్యత్తులో ఎవ్వరికైనా ఆపద వచ్చినా అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో కుషనపెల్లి రాజేందర్, తరాల అధిక్, కొండవేని రాజ్‌కుమార్, వేల్పుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘ నాయకులకు సన్మానం

కోరుట్ల: బీసీ యువజన సంఘం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు హైదరాబాద్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శికారి గోపి కృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తుమ్మనపెల్లి రాజేంద్ర ప్రసాద్‌లను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేశ్, గుజ్జ కృష్ణ, తంగళ్లపల్లి రాజ్ కుమార్, సత్యనారాయణ, నరేశ్, తోగిటి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ అమ్మవారి ఆలయానికి విరాళం

సారంగాపూర్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న మహాలక్ష్మీ అమ్మవారి ఆలయానికి గ్రామానికి చెందిన కాలగిరి అమృతమ్మ రూ. 50 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం కోసం పలువురు తన వంతుగా ఇప్పటికే భూవిరాళం అందించినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొక్కు రాజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి అవార్డు

జగిత్యాల: జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం సహాయ అధ్యాపకుడిగా పనిచేస్తున్న పడాల తిరుపతికి జిల్లాస్థాయి ఉత్తమ సహాయ ఆచార్య అవార్డు వరించింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జూన్ 20 న నిర్వహించే తెలంగాణ విద్యా దినోత్సవం సందర్భంగా ఈ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, అధ్యాపక బృందం అభినందించారు.